# మాండవి

ఎమ్. లక్ష్మీదేవి



ప్రాతఃకాలం పుష్పగుచ్ఛాలతో అలరారే ఉద్యానవనంలో మాండవి విహరిస్తున్నది. ఒక తుమ్మెద ఎగురుతూ వచ్చి ఆమె చుట్టూ రింకారం చేసింది.

"మాండవీ!" అని పిలిచినట్లు ఒక ధ్వని వినిపించింది. అయినా ఆమె తిరిగి చూడలేదు. చిరునవ్వు నవ్వింది. ప్రవాళసదృశములైన ఆమె అధరోష్ఠములు ముకుళించినవి.

"మాండవీ!" అని మరోకసారి మధుర స్వరం వినిపించింది. మాండవి వదనాంబుజం వికసించినా తన సౌందర్యాన్నంతటినీ పలికి తొలకరిస్తూ మెల్లిగా వెనుదిరిగి చూసింది.

ఎదుటనే ఆమె అనుంగుభర్త భరతుడు నిలబడి ఉన్నాడు.

"మాండవీ! నాపిలుపుకు ప్రత్యుత్తర్యం లేకపోవడానికి నే జేసిన నేరమేమో?" అన్నాడు.

"మధురస్వరం కలిగివుండటం మన్నింపరాని నేరంగదా! మీరు మధురస్వరంతో నాపేరు ఉచ్చరిస్తూంటే, మౌనంగా దాన్ని వినడంలో ఎంత హాయి కలుగుతుందో తెలుసునా? మధువును గ్రోలినట్లుంటుంది!"

"మాండవీ! మధురస్వరయుతులైన మంజుభాషిణులకు అందరి స్వరంలోనూ మాధుర్యం ప్రతిధ్వనిస్తుంది గాబోలు! మకరందాన్ని గ్రోలే ఈ తుమ్మెదలను అడుగు, నిజం తెలుస్తుంది," అన్నాడు భరతుడు.

"సూర్యాస్తమయం వరకు కుసుమాలు వికసించి వుండడం సహజధర్మమే గదా! పుష్పగుచ్ఛాలకన్న నేను భాగ్యశాలినే! ఎందుచేత నంటారేమో! ప్రతిరోజూ సూర్యుడు పుష్పాలను శోకతప్తులుగా జేసి మరుగుపడి పోతాడు. కాని, మీరెల్లప్పుడూ నాదగ్గిరే ఉండి, నాహృదయాన్ని వికసింపజేస్తారు. అది నా భాగ్యముకాదా?"

"మాండవీ! నీవు చాలా బుద్ధిమంతురాలవు. ఒకమాట. నేను, తమ్ముడు శత్రుఘ్నుడు మా మేనమామ ఇంటికి వెళ్ళవలెనని నాతలిదండ్రుల ఆజ్ఞ. ఈ మాట నీతో చెప్పి సెలవు తీసుకొందామని వచ్చాను."

మాండవి కళ్ళలో నీళ్లు తిరిగినవి. ఆమె నోట మాటరాలేదు. భరతుడు సంయమైన మాటలతో ఆమెను ఓదార్చి, ఉద్యానవనాన్ని విడిచి బయలేరాడు.

మాండవి కళ్లనుంచి అశ్రుకణాలు రాలినవి. "అయ్యో! ఇదేమి? కుడికన్ను అదురుతున్నదే!" అనుకుని కళ్లు బాగా తుడుచుకొన్నది. కాని ఇంకా అదురుతూనే ఉన్నది. ఆమె భయవిహ్వల అయింది. వెంటనే వెళ్లిన వున్న చెలికత్తెను పిల్చి, "చెలీ! వాసంతీ! పరుగిడివెళ్ళి వెంటనే నా ప్రభుని పిల్చుకొనిరా! నా దుఃఖాశ్రువులను ఆపటానికి సాధ్యమవటంలేదు. కుడికన్నేమో అదురుతున్నది. అయ్యో! నేనేమి చేసేది! నా నాథుని కొరకు ఏ అవధ కాచుకొని వున్నదో! ఓసీ! ఎందుకు ఇంకా నిలబడి ఉన్నావు? వెళ్లు! వెళ్లు! నా ఆత్మవిభుని ఆప్రత్యక్షిస్తున్న చేయజాలను," అని చెలికత్తెను తొందర పెట్టింది.

"అమ్మా! ప్రభువులవారు స్వయంగా వెళుతు

పరితపించిన వారిని వెనుకకు పిల్చుట మంచిపని కాదు." అని వెళ్లి వచ్చిన వాసంతి విన్నవించింది. మాండవి చంద్రకాంత శిలావేదికపై కూలబడిపోయింది. దిక్కు తెలియని భీతి, శంక ఆమెను ఆవహించినవి.

* * *

"వాసంతీ! మల్లికా! శుభ చంద్రికా! రోహిణీ లేవండి! లేవండి! బాగున్నది. మీ నిద్ర! ఈరోజు మా అక్కయ్య పట్టమహిషి కాబోతున్నది. చక్కగా అలంకరించుకొని ఉత్సాహంతో పొంగిపోదాం!" అంటూ వచ్చింది, మాండవి.

చెలికత్తెలందరు తమకు ముందే లేచి చక్కగా అలంకరించుకొని ఉత్సాహంతో పొంగిపోతూన్న మాండవిని చూసి సిగ్గుపడ్డారు. తొందరపాటుతో అందరూ లేచారు. శోభాయమానమైన మాండవి ముఖకాంతిని చూచి అందరూ సూర్యుణ్ని గుమిగూడి ఉన్నట్లు భ్రమించిపోయారు.

చీని చీనాంబరాలతోను, పట్టుదుకూలాలతోను, రత్నాభరణాలతోను, అలంకృతులైన దాసీజనులు వెంటరాగా చిరునవ్వు చిందులు త్రొక్కుతూండగా మాండవి బయలేరింది. గూని మందర ఎదురుపడ్డది. పట్టు జరీచీర కట్టుకొని ఉంది. చెవులకు, రత్నాలు తాపిన బంగారు కుండలాలు. మెళ్లో మేలుజాతివన్ని రత్నాల హారాలు. చేతులకు పైడి కంకణాలు. ఆమె రూపరేఖాలంకారాలు చూచి మాండవి, ఆమె చెలులు, ఘొల్లున నవ్వారు.

"ఓసీ! వాసంతీ! ఈ పట్టాభిషేక మహోత్సవానికి ముసలి పెద్దలకు కూడా తమ్ము చక్కగా అలంకరించుకొని ఆనందాన్ని అనుభవించడంలో ఎంత ఆతృతో చూశావా?" అన్నది మాండవి.

"అవునే! చిన్నిబాల నీవు నా అపరంజి బొమ్మవే! ముద్దుగుమ్మవే దానికోసమే కదూ నేనింత సన్నాహం చేశాను. నీ పట్టాభిషేక మహోత్సవాన్ని నా ఈ కళ్లతోనే చూడబోతున్నాననే సంతోషం పట్టలేక పోతున్నాను. అందుకే చక్కగా అలంకరించుకొని వచ్చాను," అన్నది గూనిమందర మాండవి అద్దంపు చెక్కిళ్లను అదిమి నొక్కిన నొక్కుని, దృష్టి తీసింది. మాండవికి ఆమె మాటలు వేడుకవలె తోచినవి.

"ఓసి అవ్వా! నీ ఏమాటలు పరిహాసం కోసం చెప్పడం తగదు. నాకు పట్టమహిషిని కావాలనే అభిలాష కలలో కూడా లేదు. రాజు, రాణి అనిపించుకుని, ప్రజలకు పీడితలేక కనిపెట్టుకొని తృప్తి గల్గించే ఆ గొప్ప బాధ్యత, అధికారము నాకక్కర లేదులే. నాథుడు జ్యేష్ఠ పుత్రులుగా జన్మించలేదు. కనుకనే రాజ్యభారము వహించే చిక్కు లేదు. అంతవరకు నేను అదృష్టవంతురాలినే" అన్నది మాండవి మందరతో.

"పిచ్చిదానా! పట్టమహిషి అనే గౌరవం పొందడానికి ఎంత అదృష్టం చేసి ఉండాలి? అబ్బబ్బ! నీ అత్తగారి మనస్సును మార్చడంలో ఎంత శ్రమపడ్డానో తెలుసా? నా పంతం నెరవేరింది. ఈ సంతోష సమాచారాన్ని నీకు తెలియచేద్దామని పరుగు పరుగున వచ్చాను," అంది మందరం, తర్వాత తను కైకేయి వద్దకు వెళ్ళి ఏ విధంగా ప్రబోధించిందీ, కట్టకడకు ఆమె మనస్సు మార్చి దశరథమహారాజు దగ్గర ఏ విధంగా వరమడిగించిందీ దశరథమహారాజు సత్యవాక్పరిపాలనార్థం శ్రీరామచంద్రుని గురించి విలపిస్తూ ఏ విధంగా మూర్ఛిల్లిందీ, కైకేయి వేకువజామునే శ్రీరామచంద్రుని పిలిపించి పిత్రాజ్ఞను ఏ విధంగా తెలియజెప్పిందీ, శ్రీరామచంద్రుడు తండ్రియాజ్ఞను తలదాల్చి కారడవులకు వెళ్ళడానికి ఎలా సమ్మతించిందీ, జరిగిన విషయాలన్నీ సవిస్తరంగా పూసగ్రుచ్చినట్లు చెప్పింది.

ఇవన్నీ విన్న మాండవి నిలువునా కంపించిపోయింది. మూర్తీభవించిన క్రోధోన్మత్త విగ్రహమైపోయింది.

"ఛీ! పాపిష్ఠురాలా! ఎంత పనిచేశావు! జ్యేష్ఠపుత్రుడుండగా తక్కినవాళ్లు రాజ్యార్హులు ఎట్లా అవుతారు? అదీగాక, శ్రీరామచంద్రుడు మాకు దైవసములు. వారియందు అత్యంత భక్తివిశ్వాసములుకల నా నాథుడు ఈ వార్తను వింటే తల్లడిల్లిపోడా? అదీగాక అన్నా వదినెలను అడవులపాలు చేసిరన్న అపవాదును నిరపరాధులైన మామీద వేస్తున్నావా? పరమ ఛండాలీ! విషసర్పాన్ని పాలుపోసి పెంచినట్లు వంచకియగు నిన్ను దరిజేర్చి మా అత్తగారు నిప్పుల నొడిగట్టుకొన్నారుగదే! నీమూలాన తీరని అపవాదును కొనితెచ్చుకోవలసి వచ్చింది. నారీ ప్రపంచానికే అప్రతిష్ఠను తెచ్చిపెట్టావు గదే! ఓసీ నీచురాలా! ఛండాలీ! వెళ్లు వెళ్లు! నా ముందు నిలబడకు. వాసంతీ! రా! రా! మనం అత్తగారి దగ్గరికివెళ్ళి దీని మూలాన్ని చంచలమైన వారి మనస్సును కుదుటబర్చుదాం" అని ఆవేశంతో చరాచరా నడవ ప్రయత్నించింది మాండవి.

సుడిగాలివలె చెలరేగిన ఆ భావాందోళన కల్లోలంతో తల్లడిల్లిపోయింది మాండవి. ఆ వేగంలో గడప దాటకుండానే మూర్ఛిల్లి క్రింద పడిపోయింది. నొసట గాయం తగిలింది. ఆరోజల్లా మాండవి మూర్ఛ తేరలేదు.

* * *

నిర్మల తటాకంలో ఒక సుందర పద్మము ఒడ్డున శ్రీరామచంద్రుడు తన సహోదరులతోనూ, వారి భార్యలతోనూ నిలబడి ఉన్నాడు. అందరూ ఆ సుందర సరోజముపై దృష్టి నిగిడిస్తారు. శ్రీరాముడు తటాకంలో దిగుతాడు. వెంటనే భరతుడుకూడ మాండవి చేయి పట్టుకొని శ్రీరామచంద్రునికి అడ్డంగా తటాకంలో దిగుతాడు. ఉన్నట్టుండి ఒక పెద్ద తుపాను చెలరేగుతుంది. మాండవి ఆ గాలివానలో చిక్కుపడిపోయింది. భరతుడు ఆమెచేయి వదలిపెట్టి ఎక్కడో మాయమైపొయ్యాడు. మాండవి దిక్కు తెలియక ప్రవాహంలో మునిగిపోతూన్నది. సుడిగుండంలో దిగిపోయిన మాండవి, "అయ్యో! నన్ను విడిచిపెట్టి ఎక్కడికి వెళ్లారు?" అని విలపిస్తున్నది. కాని భరతుడు చాలాదూరం వెళ్లినట్లుంది. ఆమెకు కన్పించనే లేదు.

భయంతో కళ్లు తెరిచింది మాండవి. అంతా స్వప్నం. ఈలాంటి భయంకర స్వప్నాలు అప్పుడప్పుడు ఆమెకు కలుగుతూనే వుంటవి. శ్రీరామచంద్రుని వనవాసం, తన మామగారి మరణం ఇవి మరపురాని సంఘటనలు. ఇప్పుడు తల్చుకుంటే ఆమెగుండె బ్రద్దలైపోతుంది.

"అమ్మా! భరతమహారాజులుంగారు వచ్చి ఉన్నారు" అన్నది వాసంతి. కాని ఆమె వదనంలో ఆనందం కన్పించలేదు. మాండవి హృదయం దడదడ కొట్టుకుంది. ఏదో ఒక భీతి ఆమె నావేశించింది. భయంతోను, దిగులుతోను భర్తకు స్వాగతమివ్వటానికి బయలేరింది.

"దేవి! కాస్త ఆగండి. మీరిప్పుడు వెళ్ల వద్దు. ప్రభువుగారు మొదట మాతృదేవిని దర్శించడానికి వెళ్ళిఉన్నారు. అక్కడ అన్ని సంగతులు కనుగొని రానియ్యండి" అన్నది వాసంతి.

"ఓసి పిచ్చిదానా! ఇన్నాళ్లు వారితో మెలిగాను. వారిస్వభావం నాకు తెలియదనుకున్నావా? వారికి రాజ్యాపేక్ష అసలే లేదు. సోదరులు కానలపాలైనారని వినగానే, వారి మనస్సు ఎంత తల్లడిల్లిపోయిందో! ఎన్ని వ్రక్కలైపోయిందో! వారెప్పుడూ సహోదరుని సేవలోనే ఆనందాన్ని అనుభవించేవారు. మొదట నేను వారిని కలుసుకుని వారి మనస్సుకు ఊరట కల్గించి శ్రీరామచంద్రుని మరల అయోధ్యకు పిలిపించడానికి తగిన ఏర్పాట్లు చేయాలి" అని పలికి కైకేయి అంతఃపురానికి బయలేరింది.

మాండవి రాకకుముందే, భరతుడు కైకేయిని దర్శించి సకలవిషయాలను సవిస్తరంగా తెలుసుకుని రౌద్రాకారుడై ఆమెతో

వాగ్వాదం జరుపుతున్నాడు. మాండవి దిగులుతో మెల్లగా జంకుతూ ప్రవేశించింది. మాండవిని చూడగానే కైకేయి, "అమ్మాయి! మాండవీ! నీవైనా నీభర్తకు బోధించవమ్మా! రాజగద్దియ నధివసించి నాల్గు దిక్కులా కీర్తిని, ప్రతాపాన్ని విరజిమ్ముతూ, రాజ్యభోగము లనుభవించు. మంచి అదృష్టం కలుగజేశాను. కాని ఇతడేమో, కన్నతల్లి అని అయినా చూడకుండా కఠినోక్తులతో నన్ను నిందించుతున్నాడు. వీరి సౌఖ్యము కోసం నేను పడిన శ్రమ కిదియా ఫలము?" అనిఅంది.

మాండవి అత్తగారికి ఎదురుమాటాడి ఎరుగదు. ఏమి చెప్పాలో తోచక, కళ్ళవెంట నీరు కార్చుతూ నిలబడిపోయింది. ఏవిధంగా న్యాయాన్యాయాలను సమర్థించి వారిద్దరినీ సమాధానపర్చవలెనో తెలియక మాండవి నిశ్చేష్టురాలై నిల్చిపోయింది. భరతుడు ఆమె మౌనాన్ని విపరీతంగా తలచుతున్నాడు. కన్నుల నిప్పులు రాల్చుతూ, "అమ్మా! చాలు చాలు! అత్తాకోడళ్లు అత్యాశాపరులై పన్నిన పన్నాగంచేత అపహరించిన రాజ్యం నాకక్కరలేదు. మీ నీచత్వం ఈనాటికి తెలిసింది. ఇక మీ సంబంధం నాకు అక్కరలేదు. నువ్వు నా తల్లివి గావు; మాండవి నాపత్ని గాదు" అని కఠోరంగా కేకలేశాడు భరతుడు.

ఈమాటలతో మొదలునరికిన అరటిచెట్టువలె కూలిపోయింది మాండవి. ఆమె హృదయం వెయ్యి వ్రక్కలైపోయింది.

"అయ్యో! నాకీ విషయంతో ఏమీ సంబంధమే లేదు. ఇన్నాళ్లు చూస్తున్నా నాగుణం మీకింకా తెలియలేదా? నన్ను నమ్మండి. మనమిప్పుడే బయల్దేరి అన్నగారిని, వదినను పిల్చుకొని వద్దాము" అని మాండవి వెక్కి వెక్కి ఏడ్చింది.

"నీ ఈ సాహసాలు నాదగ్గర పనికిరావు. స్త్రీలను నమ్మరాదని బాగా తెలిసిపోయింది. మా అన్నయ్య మీద మీరు చూపిన ప్రేమ అంతా అబద్ధం. వట్టి భ్రమ. నీకు సత్యమైన ప్రేమ ఉంటే ఎందుకు మాఅన్నయ్యను వనవాసం వెళ్లకుండా విరమింపచేయలేదు? తన పతిమరణానికి కారకురాలైన నీ అత్తగారిని ఎందుకు భస్మం చేయలేకపోయావు? భర్త రాగానే చక్కగా సింహాసనమెక్కి కూర్చొని అష్టయిశ్వర్యసుఖభోగాలను అనుభవించాలన్న దురాశకదా నిన్నీవిధంగా అడ్డుపెట్టింది? ఇక మీముఖాలు చూడడమే మహాపాపము," అని గద్దించి, వెంటనే అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

భరతుడి నోటినుంచి వెలువడిన కఠినోక్తులు వినగానే మాండవికి కొరడాతో కొట్టినట్లు అనిపించింది. ఆమెకు లోకమంతా చీకట్లు కమ్మినట్లయింది. కళ్ళు గిర్రున తిరిగిపోయినవి. ఇంతలో అటువైపునుంచి వచ్చిన సుమిత్ర, కూలి పడబోతూన్న మాండవిని పట్టుకొంది. "మాండవీ!" అన్నది. మాండవి సుమిత్రను గట్టిగా కౌగలించుకొని, "అత్తగారూ! మీరైనా నన్ను నమ్ముతారా! నేనేపాపం ఎరగను. ఈ భయంకరమైన నింద మోయలేను. నేను నిరపరాధిని. మీ పుత్రునితో చెప్పండి," అని బ్రతిమాలింది.

"అమ్మాయి! భరతుడు అత్యుగ్రకోపంలో ఉన్నాడు. నీ నిర్మలస్వభావం అతనికిప్పుడు గోచరించదు. లోకం నీ నిర్దోషత్వాన్ని గ్రహించడానికి కొంతకాలం గడవాలి. అంతవరకూ ఓర్చుకో!" అన్నది సుమిత్ర.

"అమ్మా! భర్తచే తిరస్కరించబడిన స్త్రీ హృదయం ఎన్నివ్రయ్యలైపోతుందో మీకు తెలియదా! అయ్యో! విరహార్తిని భరించడం కూడా అంత దుఃఖకరంగా తోచదు. కాని పతి సమీపంలోనే వుంటూ ఆ తిరస్కారభావాన్ని భరించడం దుర్లభం. భర్త ప్రేమేకదా స్త్రీకి జీవిత సౌభాగ్యం" అని మాండవి రోదించింది. వెక్కి వెక్కి ఏడుస్తున్న మాండవిని ఓదార్చుతూ తోడ్కొని వెళ్ళింది సుమిత్ర.

* * *

అడవికి వెళ్ళిన అగ్రజుని తీసుకురావడానికి భరతుడు సపరివారంతో బయల్దేరాడు. మార్గంలో భరతుడు స్వజనులందరి సౌకర్యాసౌకర్యాలను తెలుసుకొంటూ, కావలసిన సదుపాయాలన్నీ చేశాడు. కాని కైకేయిని, మాండవిని కన్నెత్తిఅయినా చూడలేదు. మాండవిహృదయం వేదనతో కృంగిపోతున్నది, దుఃఖంలో కృశించి పోతున్నది. కైకేయి, సౌందర్యరాశియైన మాండవికృశించిపోవడం చూసింది, పశ్చాత్తాపం కల్గింది. "మాండవి! నేను పరమపాపిని, దౌర్భాగ్యురాలను. పతి మరణానికి మాత్రమే గురికాలేదు. మీ దంపతుల చిరవియోగానికి హేతువైనాను" అని దుఃఖాశ్రువుల రాల్చింది.

మాండవికి అత్తగారిపై అనుతాపం కల్గింది. ఇక తనుతప్ప అత్తగార్ని ఆదరించే దెవరు? అందరూ ఆమెను ఆడిపోసేవారే. తిట్టిపోసేవారే! "అమ్మా! మనం విధివశులమై వున్నాము. ఏమి చేయగలము?" అన్నది మాండవి. అంతకుమించి మరేమి చెప్పగలదు?

భరతాదులతో సంతోషంగా సంప్రదించి, శ్రీరామచంద్రుడు కైకేయినే మొట్టమొదట పల్కరించాడు. అంతలో సీత మాండవి దగ్గరికి వచ్చింది. "అయ్యో! మాండవీ! ఇదేమి! ఇట్లు చిక్కి శల్యావశిష్టవైపోయావు?" అని అంగలార్చింది సీత.

మాండవి సీతను కౌగిలించుకుని కన్నీళ్లతో అభిషేకించింది. సుమిత్ర, సీత



# మాండవి

మాండవి దుఃఖకారణాన్ని అడగటానికి వీలు లేకుండ తన దగ్గరకు పిల్చుకొంది.

భరతుడు విఫలమనోరథుడై శ్రీరామచంద్రుని ఆజ్ఞమేరకు పాదుకలను ఔదల దాల్చి అయోధ్యకు మరలివెళ్లాడు. సకల పరివార బంధుమిత్రాదులు అతని ననుసరించారు. కాని మాండవి అక్కడే కూలబడిపోయింది. సుమిత్ర "అమ్మాయీ! లే!" అని లేపింది. కాని మాండవి లేవలేదు.

"అత్తయ్యా! నేనెక్కడ ఉంటే ఏం? అంతఃపురంలో ఏ సౌభాగ్యాన్ని అనుభవిస్తాను? భర్తృ తిరస్కారాన్ని పొందిన స్త్రీకి ఈ ప్రపంచంలో ఎక్కడా తావు లేదు. కాబట్టి అత్తయ్యా! నేను భర్తకు కంటకంగా నగరిలో ఉండడం కంటే ఈ అడవిలోనే ఉండిపోతాను," అన్నది మాండవి.

"అయ్యో! పిచ్చిపిల్లా! లోక మెరుగని బేలవు. నా కోడలు ఊర్మిళకంటే నీ మనోవ్యథ గొప్పదని నే నెరుగుదును. సహనంతోను, సేవా శుశ్రూషలతోను, త్యాగంతోను నీ భర్తమనస్సును మళ్ళించుకోవమ్మా! పతి ప్రాపున ఉండవలసినదే సతీ ధర్మము. లేవమ్మా!" అన్నది. మాండవి చేసేది లేక సుమిత్రతో బయలుదేరింది.

* * *

నందిగ్రామంలో ఒక పర్ణశాల. ఆశ్రమంలో మాండవి జీవచ్ఛవంవలె తిరుగుతున్నది. ఆమె ఆభరణాదులను ధరించడం లేదు. సాధారణ స్త్రీ వలె ఉన్నది. ఆమె ఆశ్రమాన్ని శుభ్రంచేస్తున్నది. ఇప్పుడామెకు చెలికత్తెలు లేరు. దాసీదాసజనం లేరు. పుష్పమాలలతో శ్రీరామచంద్రుని చిత్రపటాన్ని అలంకరించింది. పూజకోసం పుష్పాలను ఏరింది.

ఇంతలో భరతుడు సుస్నాతుడై ఆశ్రమానికి వచ్చాడు. మాండవి నమ్రతతో అతని పాదద్వయాన్ని కడిగి పూలతో పూజించింది. చల్లటి నీళ్లతోపాటు, రెండు వేడి కన్నీటిచుక్కలు ప్రతిరోజూ అతని పాదాలపై రాల్చేది. కాని భరతుడు చలించలేదు. అయినా భరతుని మనస్సులోమటుకు ఏదో వేదన. మాండవితో మౌనవ్యవహారమే తప్ప నోరు విప్పి ఒక్కమాట కూడా ఇంతవరకూ మాట్లాడలేదు.

పద్నాలుగేండ్లు ఇట్లాగే సేవా శుశ్రూషలోనే గడిపింది—మాండవి. భరతునికి కందమూలఫలాలు సమర్పించి అత్తగారి సేవకు పూనుకొనేది. కైకేయి సకల జనుల దూషణభారంచేతనూ, అవమానంచేతనూ కృంగి

(56-వ పేజీ చూడండి)




ఆరోగ్యమునకు
అతి సులభమార్గము

మీ బిడ్డలు యిష్టముతో పాలు సేవించే విషయమై యిక మీరు శ్రమ పడనక్కర లేదు. బ్రౌన్ అండ్ పోల్సన్ కస్టర్డ్ పొడరుతో తయారు చేసిన మీగడ పదార్థము వారికి చాలయిష్టము. అందులో ఆరోగ్యధాతువులు వున్నవి. యిది మీరు పాలతో తయారు చేయండి. యిది పరిశుద్ధమైన శాఖాహార వుత్పత్తి.

ఉచితము — "తినడానికి మంచి వస్తువులు" అనే విస్మయము చెందే ఒక చిన్న పుస్తకము. మీ పేరు, చిరునామా యిస్తూ రెండు అణాలు పోస్టల్ స్టేంపులలో యీ దిగువ అడ్రసుకు వ్రాయండి.

కార్న్ ప్రాడక్ట్స కొ., (ఇండియా) ప్రయివేట్ లి.,

# మాండవి

(16-వ పేజీ తరువాయి)

కృశించిపోయింది. అదీగాక చిక్కి శల్యావశిష్టఅయిన మాండవిని చూచి మరింత లోలోన కుమిలిపోయేది. మాండవి అత్తగారిని ఓదార్చి పండ్లు, ఫలాలు భుజింపచేస్తూండేది. అత్తగారి బలవంతాన భర్త తినగా మిగిలినవి తాను స్వీకరిస్తూండేది.

రోజు రోజుకు భరతుని ఆవేదన ఎక్కువైంది. అన్నగారు క్షేమంగా తిరిగి రావాలనే ఆతృత ఒకవైపు, దినదినమూ కృంగి కృశించి కుమిలిపోతూన్న మాండవిని గూర్చిన ఆవేదన ఒకవైపు అతని హృదయాన్ని కలతపెట్టినవి.

* * *

వనవాసంనుంచి మరలివస్తున్న రామవిభునికి స్వాగతమివ్వడానికి పురజనులందరితో బయల్దేరాడు భరతుడు. నగరిలోకి ఆబాలవృద్ధులూ శ్రీరాముని దర్శనార్థం గుమిగూడి ఉన్నారు. కాని మాండవి తన ఆశ్రమాన్ని శుభ్రం చెయ్యడంలోనే లీనమైపోయింది.

ప్రజలు తన బంధు మిత్రాదులు, మంత్రి సామంతులు మొదలైనవారందరూ వచ్చి తన్నెదుర్కొన్నప్పటికీ శ్రీరామునికి ఏదో లోటు కన్పించింది.

“భరతా!” అన్నాడు శ్రీరాముడు, భరతుడు మౌనంగా నమస్కరించాడు.

“భరతా! మా తల్లి కైకేయి ఏది? మాండవి ఏది?” అని ప్రశ్నించాడు.

భరతుడు మాట్లాడలేదు. అతని మౌనం శ్రీరామచంద్రుని కలవరపెట్టింది. వారిద్దరిపై భరతునికిగల క్రోధాన్ని, కరుణాహీనతను గుర్తించాడు. భరతుడు తనభావములను శ్రీరాముడు గుర్తించకుండగా వెనుదిరిగి సుమంత్రిని వారిద్దర్నీ తోడ్కొని రమ్మని ఆజ్ఞాపించాడు. కాని వెంటనే శ్రీరాముడు, “భరతా! బాగున్నది. నీవు వారిపట్లచూపుతూన్న మర్యాద, ఆదరమూను. నీవే స్వయముగా వెళ్ళి పిల్చుకొనిరమ్ము! లేకపోతే నేనే వారిని దర్శించ వెళ్ళుతాను. ఏంజరిగినా విధివశమని నీవింకా తెలుసుకొనలేదుగాబోలు! నీతల్లి నన్ను వనవాసానికి మాత్రమే పంపినది. కాని నీకోసం కనిపెట్టుకొని ఉన్నకన్నతల్లిని నిరాకరించావు, నిందించావు. ఎంతపాపానికి ఒడిగట్టావు? మాండవి నీఅర్ధాంగి. సహధర్మిణి. సుఖదుఃఖాలను నీతో సమానంగా అనుభవించవలసిన బాధ్యురాలు. నేరంచేసిన భార్యను క్షమించడం పతిధర్మం. నిరపరాధిని దండించడం ఏ న్యాయశాస్త్రాలలో చదివావు? స్వమాత, స్వపత్నిపట్ల న్యాయమును ధర్మమును గుర్తించని నీవు రాజ్యభారం ఎట్లా నిర్వహించావు? వెళ్ళు వెంటనే వారిని తోడ్కొని రా!” — అన్నాడు శ్రీరామచంద్రుడు.

“అన్నా! నా అజ్ఞానం నశించింది. మీవంటి సకలగుణపరిపూర్ణులైన సహోదరుణ్ణి పొందడం నా అదృష్టమే,” అని భరతుడు ఒక్క పరుగులో ఆశ్రమాన్ని చేరుకున్నాడు.

ఎప్పటివలె మాండవి భరతుని పాదాలను కడిగి పూలతో పూజించింది. వానచినుకుల్లాగ ఆమెపై బొటబొట అశ్రుకణాలు రాలినవి. మాండవి దిగ్భ్రమతో తలెత్తింది. భరతుడు కన్నీళ్ళతో, “మాండవీ!” అని ఆమెను చేరదీశాడు.

మాండవి పట్టరాని ఆనందంతో ఆశ్రమమంతా పరుగులెత్తింది. కైకేయి దగ్గరికి వెళ్ళి ఆమెను గట్టిగా కౌగలించుకొని, “అమ్మా! అమ్మా! అమ్మా! నా ప్రభువు నన్ను అనుగ్రహించారు,” అంటూ పొంగిపోయింది. ఆ ఆనందోద్రేకంతో భరతుని పాదాలదగ్గర మూర్ఛిల్లిపోయింది. కైకేయి భరతుడు మాండవిని అనుగ్రహించడం చూసి ఆనందించింది.

కైకేయిని చూడగానే శ్రీరామచంద్రుడు ప్రణమిల్లినాడు. సీత మాండవిని పలకరించింది. తర్వాత శ్రీరాముడు నవ్వుతూ, “భరతా! పాదుకారాజ్యానికి నువ్వేలోటు తెస్తావని అనుకోలేదు,” అన్నాడు.

భరతుడు భయంతో, “ఏమైందన్నయ్యా! అట్లా అంటున్నారు?” అన్నాడు.

“నేరస్థులను అపరాధాలను విచారించకుండానే కఠినశిక్షవిధించి నీతల్లిని, పత్నిని, శల్యావశిష్టులుగాచేశావు. నీతల్లిని, భార్యను చూస్తే ‘తల్లిని భార్యను సుఖపెట్టలేనివాడు ప్రజలను ఎట్లాసుఖపెట్టగలడని’ లోకమానదు,” అన్నాడు. భరతుడు సిగ్గుపడ్డాడు.

అయితే మాండవి “బావగారూ! పధ్నాలుగేండ్లు కంటికి నిద్దురలేక మీ రాకకోసమే కాచుకుకూర్చున్న మీ అనుగు [illegible]ండి. ప్రజలసుఖానికై ఎల్లకాలం కనిపెట్టుకొని ఉన్నందువల్ల, తల్లిని భార్యను చూడడానికి తీరిక దొరకలేదు. అంతే!” అన్నది.

మాండవిమాటలకు భరతుడు ఆశ్చర్యపడిపోయాడు. అప్పుడు ఆమెత్యాగాన్ని గుర్తించాడు.

“మాండవీ! మంచిమాట పలికావు. ఎల్లప్పుడు భర్తనేరాలను కప్పిపుచ్చడం భార్యలకు సహజధర్మమేకదా!” అన్నాడు శ్రీరామచంద్రుడు మందహాసంతో.

* * *

సరస్వతీదేవి బ్రహ్మదేవుని అనుజ్ఞపొంది తొందరగా బయల్దేరింది. ఆరోజు వాల్మీకి రామాయణం వ్రాయడానికి పూనుకొంటాడు. సకలలోక కళ్యాణార్థం ఆ కావ్యపరిసమాప్తికి సరస్వతిసహాయం చేయాలి. సరస్వతి వస్తూన్నప్పుడు ఎవరో పిల్చారు. ఆధ్వని వచ్చిన దిక్కు చూసింది. పూజాగృహంలో మాండవి పిల్చింది. సరస్వతి ఆమెకు ప్రసన్నురాలైంది.

“మాండవీ! నన్నెందుకు పిల్చావు? నేడు వాల్మీకి రామాయణం రచిస్తున్నాడు. నేను ఆ మహామునికి సహాయపడవలెను. అందుకోసమే వేగంగా పోతున్నాను,” అంది.

“దేవీ! నాకొక వరమనుగ్రహించాలి.”

“ఏమివరము కావాలి మాండవీ?”

“దేవీ! వాల్మీకిరామాయణంలో మాండవి భరతుని పత్ని అనే వివరము తెలియబరిస్తే చాలు. తక్కిన నాసంగతులు వివరించరాదు. ఇదే నా ప్రార్థన.”

“అదేమిటి మాండవీ! రామాయణకథలో సీతా, ఊర్మిళలకన్న నీవు మిన్నవైతివే! నీ సతీధర్మం, క్షమ, సేవాభావం ప్రశంసనీయమైనవేకాక, స్త్రీలోకానికే ఆదర్శప్రాయమైనవి. ఇటువంటి ఉత్తమచరితవైన నిన్ను విడిచి ఆదర్శగ్రంథం రామాయణ రచన ఎట్లాసాగుతుంది?”

“దేవీ! నాసేవ నిష్కామమైనది. కీర్తిని, గౌరవాన్ని ఆశించి నేను సేవచేయలేదు. అది నాధర్మం. అదీగాక నావృత్తాంతం వివరించడంవల్ల నిరపరాధియైన భార్యను భరతుడు దుఃఖపెట్టినాడన్న అపఖ్యాతి నాథునకు కలగవచ్చు. అందుకు నేను సమ్మతించను. కాబట్టి తల్లీ, నాకు వాగ్దానమివ్వు! నా ప్రార్థనను చెల్లించు,” అని మాండవి వేడుకున్నది.

సరస్వతి ఆశ్చర్యపరవశురాలయింది. “ఆహా! స్త్రీల సౌజన్యం ఎంతగొప్పది!” అనుకొని వాల్మీకాశ్రమానికి ప్రయాణమైంది.

—తమిళరచనను అనుసరించి]



బ్రాంచీలు: హైదరాబాదు & విజయవాడ.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.